క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రిన్సిపాల్ అనురాధ

చేవెళ్ల: డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభమైందన్నారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీఏ, బీకామ్,(కంప్యూటర్స్), బీఎస్సీ(లైఫ్‌సైన్స్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్)కోర్సులు, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఎన్ఎస్ఎస్, కేరియర్ గైడ్‌లైన్స్, జాబ్ డ్రైవ్ తదితర సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కళాశాల నూతన భవనం కూడా ప్రారంభం అవుతుందని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అందుబాటులో 'జనుము'

మొయినాబాద్: రైతులు పచ్చిరొట్ట పైరుగా వేసుకునేందుకు జనుము, జీలగ (విత్తనాలు) అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాగమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనుములు 40 కిలోల బస్తా ధర రూ.1226, జీలుగలు 30 కిలోల బస్తా ధర రూ.843గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు గురువారం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి వచ్చి తీసుకోవాలన్నారు.

'కంటి వెలుగు'తో దృష్టి సమస్యలు దూరం

జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్



కంటివెలుగును ప్రారంభిస్తున్న గణేశ్

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకమ్మగూడ సర్పంచ్ రజనీత ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి గణేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దృష్టి సమస్యలతో బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడని అన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ళద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, నాయకులు వీరేందర్‌గౌడ్, విజయ్, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్: పట్టణంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఐజాక్ న్యూటన్ గుండెపోటుకు గురై మృతి చెందాడు. బుధవారం షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్, బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డిలు ఐజాక్ న్యూటన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ శంకర్



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొత్తూరు: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తూరు ఎస్ఐ శంకర్ తెలిపారు. బుధవారం ఆయన మండల వ్యవసాయ అధికారి(టాస్క్‌ఫోర్స్), సభ్యులతో కలిసి మండలంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు దుకాణం నిర్వాహకులు తప్పనిసరిగా ఆ విత్తనాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. పంటలు పూర్తయ్యే వరకు రైతులు బిల్లులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ప్రతి దుకాణంలో విత్తనాలు, ఎరువుల ధరలు కనిపించే విధంగా వివరాలు బోర్డులో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా వ్యాపారులు విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను (నిల్వలను) రిజిస్టార్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

- వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- వరికి కనీస మద్దతు ధర రూ.2060
- నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

షాద్‌నగర్: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది.

షాద్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని చేగూరు, కొత్తపేట, మేకగూడ, కొందుర్గు, షాద్‌నగర్‌ల్లో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరికోతలు ప్రారంభం కావడంతో రోజురోజుకూ ఈ కేంద్రాలకు తాకిడి పెరుగుతుంది. రైతులు తీసుకొచ్చే చివరి ధాన్యం వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వం సూచిస్తుంది. పంటలను అమ్మేందుకు తీసుకొచ్చినప్పుడు తేమ 17శాతం మించకూడదని, మట్టి పెళ్లు, రాళ్లు, చెత్త, తాలు 1శాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగులు తిన్నధాన్యం 5శాతం కంటే మించకూడదని, పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం 3శాతం మించకుండా ఉండాలని అధికారులు సూచించారు. తద్వారా పంటకు మంచి మద్దతు ధర పొందవచ్చని అన్నారు.

మద్దతు ధర ఇలా..

ప్రభుత్వం వరిధాన్యానికి, మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర ప్రకటించింది. ఏ గ్రేడ్ వరిధాన్యానికి క్వింటాలుకు రూ.2060, సాధారణ రకానికి రూ.2040, మొక్కజొన్న క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.1932 ప్రకటించారు.

ఇవి తప్పనిసరి

- రైతులు పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేటప్పుడు ఆధార్, బ్యాంకు ఖాతాలకు విధిగా తమ ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలి
- పంట విక్రయించే సమయంలో రైతులు ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. కావునా విధిగా ఫోన్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి
- ఓటీపీ నంబర్ వచ్చిన తర్వాతే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుంది.
- ఆధార్‌కార్డు, జిల్లా కలెక్టర్‌చే నియమించిన అధికారి ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ నంబర్‌కు సంబంధించిన పత్రాలను విధిగా కొనుగోలు కేంద్రంలో అధికారులకు అందజేయాలి
- బ్యాంకులో ఖాతా పని చేస్తున్నట్లు బ్యాంకు అధికారుల నుంచి రైతులు ధ్రువీకరించుకోవాలి.

ధాన్యం తీసుకురావాలి



నాణ్యతా ప్రమాణాలను పాటించి ధాన్యాన్ని బాగా ఎండబెట్టి పూర్తిగా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు పొందవచ్చు.

– రఘునందన్, సీఈఓ, పీఏసీఎస్, షాద్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కేంద్రాల్లో రైతులకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పిస్తున్నాం.

– అశోక్, చైర్మన్, పీఏసీఎస్, చేగూరు

రైతు సంక్షేమానికి పెద్దపీట



ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పంటలకు ప్రభుత్వం మంచి మద్దతు ధర చెల్లిస్తుంది. నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలి. దళారులను ఆశ్రయించి మోసపోవద్దు.

– అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

బీమాతో ధీమా : ఎమ్మెల్యే కాలె



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

చేవెళ్ల: బీమా బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ల బ్రాంచ్ నుంచి బాధిత కుటుంబానికి వచ్చిన బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్‌లో బీమా చేసిన పాలేపల్లి బుచ్చన్న అనే వ్యక్తి మృతి చెందడంతో అతని భార్య వెంకటమ్మకు బీమా సొమ్ము రూ.10,95,750 చెక్కును అందజేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు వారి కుటుంబానికి ప్రతినెల రూ.4500 పెన్షన్ కూడా ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ప్రతి ఒక్కరు వారివారి స్తోమతకు తగ్గ విధంగా బీమా చేయించుకోవాలని సూచించారు. శ్రీరామ్ సంస్థ ద్వారా బాధిత కుటుంబానికి 18లక్ష, 51వేల 750 రూపాయలు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్, ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఈడీ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నరేందర్, ఆర్ఎం శ్రీనివాస్, ఏరియా మేనేజర్స్ హనుమంతు, సత్యనారాయణ, సురేశ్, ఎంప్లాయిస్ హర్షవర్ధన్, రమేశ్, నవీన్, శ్రీశైలం, తిరుపతి, ప్రవీణ్, అనిల్ ఉన్నారు.

నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు



ఇంటింటి సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

డాక్టర్ స్రవంతి

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డాక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంజయ్ కాలనీ, కసబ్‌వాడలో గర్భిణుల వివరాల నమోదుకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. అర్బన్ ఏరియాల్లో చాలా మంది మహిళలు గర్భం దాల్చినా ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వడం లేదన్నారు. గర్భవతులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసేందుకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు వద్దనుకునే వారు కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని సూచించారు. అదేవిధంగా కాన్పుల మధ్య ఎడం పాటించాలన్నారు. రక్తంలో ఐరన్ తక్కువగా ఉండడం వల్ల రక్తహీనత వస్తుందని చెప్పారు. ఈ సర్వేలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, ఏఎన్ఎంలు ఎస్తర్ రాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు, గ్రామస్తుల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. 18న గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, డ్రైనేజీలను శుభ్రం చేసి మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. 19న ప్రభుత్వ స్థలాలను శుభ్రంగా చేయించాలని తెలిపారు. 20న గ్రామ పంచాయతీ, అనుబంధ గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో, ఇండ్ల వద్ద పిచ్చి మొక్కలను తొలగించాలని చెప్పారు. 21న దోమలు నిల్వ ఉండకుండా అయిల్‌బాల్స్‌ను వాడి ఫాగ్గింగ్ చేయించాలన్నారు. డ్రై డేగా పాటించాలని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. అవసరమైన వారిని గుర్తించి మురుగుదొడ్లను మంజూరు చేసి నిర్మాణం పూర్తి అయ్యే విధంగా చూడాలని పేర్కొన్నారు. 22న గ్రామాల్లో ఇంటి ముందు ఇంకుడు గుంతల నిర్మాణం అవశ్యతను వివరించాలన్నారు. తాగునీటి సరఫరా ప్రాంతాల్లో వ్యక్తిగతంగా పరిశీలించి, శుభ్రం చేయించాలని చెప్పారు. పై విధంగా ఉన్నతాధికారుల సూచనాలను పాటిస్తూ పారిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

ఉపాధి పనులతో లబ్ధి

గ్రామాల్లో కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీలు జాబ్ కార్డులను పొంది 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీఓ నర్సింహులు, మండల విద్యాధికారి మనోహర్, వ్యవసాయ అధికారి శిరీష, ఏపీఎం భగవంతు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై చర్యలకు డిమాండ్

కొత్తూరు: కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించని పరిశ్రమల నిర్వాహకులపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో కొనసాగుతున్న ఆయా పరిశ్రమల నిర్వాహకులు కార్మికులతో 12 గంటలు పనులు చేయించుకుంటూ 8 గంటల వేతనాలు ఇవ్వడం దారుణమన్నారు. అలాగే, పరిశ్రమల నిర్వాహకులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సగం మందికి మాత్రమే పీఎఫ్ చెల్లిస్తూ మిగతా కార్మికులకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి

ఆమనగల్లు: నాణ్యత ప్రమాణాలు పాటించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి అన్నారు. బుధవారం ఆమె పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. ధాన్యంలో తేమ 17శాతం, చెత్త తాలు 1శాతం, రాళ్లు, మట్టిపెళ్లలు, రంగుమారిన ధాన్యం 5శాతం, పూర్తిగా తయారు కాని ధాన్యం 3శాతం ఉండాలని రైతులకు సూచించారు. ఆమె వెంట వ్యయసాయ విస్తరణ అధికారి రాణి, రైతులు ఉన్నారు.

శిలాఫలకాలే తప్ప పనులు జరగడం లేదు

మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గా మహేందర్



మాట్లాడుతున్న మహేందర్, తదితరులు

మొయినాబాద్ రూరల్ : మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు వాటి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గా మహేందర్, బీజేపీ మండల నాయకులు యాదగిరిలు కోరారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు చిల్కూరు-మొయినాబాద్, హిమాయత్‌నగర్- చిల్కూర్ బాలాజీ సన్నిధికి వెళ్లే రోడ్లకు శిలాఫలకాలు, శంకుస్థాపనలు చేశారే తప్ప పనులు చేయడం లేదని విమర్శించారు. కనీసం చిల్కూరు బాలాజీ సన్నిధికి వచ్చే భక్తులకు రోడ్డు సక్రమంగా లేకపోవడం సిగ్గుచేటు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకాలు వేసే కంటే పనులు ప్రారంభిస్తే గ్రామస్తులు, భక్తులు, ఎంతో సంతోషిస్తారని అన్నారు. ఇప్పటికైనా చిల్కూరు గ్రామ సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదగిరి ముదిరాజ్, నాలా రాజు, రాంచందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



నరసింహారెడ్డిని సన్మానిస్తున్న భీంభరత్

టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్

షాబాద్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో డీసీసీ అధ్యక్షుడిగా రెండవసారీ ఎన్నికైన చల్లా నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు సమ్మేస్థితిలో లేరన్నారు. దేశానికి వెన్నెముక రైతన్న అని, రైతన్నకు బాసటగా నిలిచేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, నిత్యావసర సరుకుల ధరలు పెంచి నిరుపేదల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ రామ్, నాయకులు తదితరులున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



చేవెళ్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, తదితరులు

గ్రామీణ స్థాయి నుంచే యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహించింది. 15వ తేదీ నుంచి జరిగిన ఈ పోటీలు బుధవారంతో ముగిశాయి. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా పలు జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు హాజరై బహుమతులు ప్రదానం చేశారు. –సాక్షి నెట్‌వర్క్



బహుమతులు అందజేస్తున్న శోభ, ఎంపీపీ, జెడ్పీటీసీ



కొత్తూరు: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, లావణ్య



కేశంపేట: బహుమతులను అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ విశాల



శంకర్‌పల్లి: బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే



నందిగామ: బహుమతులను అందజేస్తున్న ప్రియాంక

పచ్చిరొట్ట.. పంటకు జీవం

వ్యవసాయాధికారి వెంకటేశం



షాబాద్: పచ్చిరొట్ట సాగుకు జీవం పోస్తుందని, ఆలస్యంగా పంటలను సాగు చేసేవారు పచ్చిరొట్ట పైర్లను విత్తితే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచించారు. సేంద్రీయ సాగులో భాగంగా జనుము, జీలుగ, పెసర వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని ఖరీఫ్ కంటే ముందుగా గ్రామాల్లో చేసిన ప్రచారానికి మంచి స్పందన వచ్చిందని, వర్షాకాలం మొదట్లో చాలా మంది రైతులు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టులో ఆలస్యంగా ఆరు తడి పంటలు సాగు చేసిన వారు కూడా పచ్చిరొట్టపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ సూచించారు. ఇందుకు ఎకరాకు 12 కిలోల జనుము విత్తనాలు అవసరం, వాటిని వాడితే పొలానికి 40 కిలోల నత్రజని లభిస్తుంది. జీలుగ సాగులో ఎకరాకు 8 కిలోల పెసర విత్తనాలను విత్తితే 3 టన్నుల పచ్చిరొట్టకు 25 కిలోల నత్రజని లభిస్తుంది. వాటి పైర్లు నేల స్వభావాన్ని వృద్ధి చేస్తాయి. పైర్లకు 30 శాతం నత్రజని ఎరువు వాడకాన్ని తగ్గిస్తుంది. వీటి వాడకం వల్ల భూమికి నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరగడంతో పాటు నేల కోతకు గురికాకుండా కాపాడుతుంది. ముఖ్యంగా నేలలో మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. పచ్చిరొట్ట పైర్లను వేసి 55 రోజుల్లో పూత దశలో నేలలో కలియదున్నాలి. నేలలో తొందరగా కుళ్లాలంటే ఒక ఎకరాకు 50 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ ఎరువును చల్లాలి. వర్షాభావ పరిస్థితుల్లో జీలుగ ఆకులు రసంలా నిండి పచ్చగా ఉన్నప్పుడు 55 రోజుల్లో ఉన్న దశలో నాగలితో నేలలో కలిసేటట్లు దున్నాలి. ఈ పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల రైతులు రసాయన ఎరువులకు పెట్టే ఖర్చుతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చుని తెలిపారు.